క్లుప్తంగా

వాహనాలకు వేలం

ఇల్లెందు: ఇల్లెందు ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ఐదు వాహనాలకు ఈ నెల 25న బహిరంగ టెండర్ వేలం పాటకు ఆహ్వానం పలుకుతున్నట్లు సోమవారం అబ్కారీ సీఐ వేమ రాజశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరుగు వేలం పాటలో ఆసక్తి గల వారు ఈఎండీ చెల్లించి పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పోరుబాట స్థూపాన్ని పునర్నిర్మించాలి

సుజాతనగర్: బంజారాల మనోభావాలు దెబ్బతినకుండా మంగపేట గ్రామ ప్రవేశ ద్వారం పోరుబాట స్థూపాన్ని పునర్నిర్మించాలని సీపీఎం నాయకుడు కాసాని ఐలయ్య డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకుడు గుగులోత్ ధర్మాతో కలిసి సోమవారం ఆయన స్థూపం శిథిలాలను పరిశీలించి మాట్లాడారు. 2006లో బంజారాల పాదయాత్రకు గుర్తుగా ఈ స్థూపాన్ని నిర్మించగా, రోడ్డు విస్తరణ పేరిట ఆర్‌అండ్‌బీ అధికారులు కూల్చారన్నారు. ఈ విషయాన్ని ముందు చెబితే మరోచోటకు తరలించేవారమని తెలిపారు. నాయకులు భాస్కర్, శ్రీకాంత్, జగన్, మాన్యా పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాన్ని రద్దు చేయాలి

సుజాతనగర్: బినామీ పేరుతో నడుస్తున్న సుజాతనగర్ మీ సేవా కేంద్రాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్, ఐటీడీఏ పీఓ, డిప్యూటీ తహసీల్దార్లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ... మండల కేంద్రంలో మీసేవా కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందన్నారు. కేంద్రంలో దీర్ఘకాలిక రోగాలు శాశ్వతంగా తగ్గుతాయని నమ్మించి మౌలిక ఔషధాలు, ఆయుర్వేద మందులు అమ్ముతున్నట్లు తెలిపారు. గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, నాయకులు గణేష్, శ్రీకాంత్, గని, పవన్ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, ఎంపీపీ భూక్య రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శతాధిక వృద్ధురాలి మృతి

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల ఎర్రమ్మ (105) శతాధిక వృద్ధురాలు సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భౌతికాయాన్ని జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, జిల్లా నాయకులు వేల్పుల నరసింహారావు, మోదుగు రామక్రిష్ణ, పణితి వెంకటేశ్వర్లు, దేవరకొండ కిరణ్, మాచినేని సత్యనారాయణ, తదితరులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ భీమా శ్రీవల్లి అన్నారు. సోమవారం కూలీలైన్ వార్డులో ప్రారంభమైన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. భీమా శ్రీధర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉస్మానియా ఆర్‌ఎంఓకు సన్మానం

ఇల్లెందు: హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్ ఆర్‌ఎంఓ డాక్టర్ రఫీని ఇల్లెందులో పలువురు సన్మానించారు. హైదరాబాద్ నుంచి సోమవారం ఆయన కొత్తగూడెం వెళ్తుండగా ఇల్లెందులో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్, మున్నాఫ్, శ్రీనివాస్, కోటి తదితరులు సన్మానించి మాట్లాడారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

జూలూరుపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించడంతోపాటు, పెండింగ్ కేసుల వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ జె.వసంత కుమార్, ఎస్సై పోటు గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: నిత్యం రద్దీగా ఉండే పోలీసు పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదకరంగా గుంతపై 'ఏమరుపాటుగా వెళ్తే అంతే' అనే శీర్షికతో గత నెల 29న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రమాదకరంగా ఉన్న గుంతలను సోమవారం పూడ్చివేయించారు.

చేరువగా.. మరింత మెరుగ్గా

ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు

- త్వరలోనే అందుబాటులోకి రానున్న డయాలసిస్
- ఆర్థో ఆపరేషన్లకు థియేటర్ల ఏర్పాటుపై దృష్టి



ఇల్లెందులోని ప్రభుత్వ వైద్యశాల



డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు జరుగుతున్న పనులు



ఆపరేషన్ చేయించుకున్న బాలుడితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారాక పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. డిసెంబర్ నుంచి ప్రసూతి, ఇతర ఆపరేషన్లు మొదలుపెట్టారు. వివిధ మార్గాల్లో ఆస్పత్రికి రూ.30లక్షల మేర నిధులు సమకూరిన నేపథ్యాన తాజాగా ఆర్థోపెడిక్ ఆపరేషన్లపై దృష్టి సారించారు. ఇందుకోసం కీలకమైన సీఆర్‌ఎం మిషన్ ఏర్పాటుకు టెండర్ ఆహ్వానించారు. ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్సలకు ప్రత్యేక థియేటర్ ఏర్పాటు చేస్తే ఏ ఆపరేషన్ అయినా ఇల్లెందులోనే చేసే అవకాశముంటుంది. డాక్టర్ సింధు నేతృత్వంలో స్త్రీ, వైద్య విభాగంలో ప్రసూతి ఆపరేషన్లు, డాక్టర్ రామచంద్రునాయక్ ఆధ్వర్యంలో జనరల్ ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. గత నాలుగు నెలల్లో సుమారు 140కి పైగా ఆపరేషన్లు జరిగాయి.

ఆరోగ్యశ్రీలోనే అన్నీ..

ఇల్లెందులోని ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. తద్వారా సమకూరే ఆదాయంతో ఆస్పత్రి అభివృద్ధికి వీలు కలుగుతోంది. వైద్య విధాన పరిషత్‌లోకి మారాక ఆస్పత్రిపై నమ్మకంతో ప్రతీరోజూ 800 మంది చికిత్స కోసం వస్తున్నారు. అయితే, అవసరమైన వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. కాగా, ఆరోగ్యశ్రీలో పరీక్షించిన వారికి శస్త్రచికిత్స కోసం ప్రత్యేక థియేటర్ల ఏర్పాటుపై దృష్టి సారించారు.

ఈ పరికరాలు ఉంటేనే..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. కానీ మెరుగైన వైద్యం అందాలంటే తగిన సదుపాయాలుండాలి. ముఖ్యంగా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సీఏఆర్ఎం, డ్రిల్లింగ్ యంత్రం, డెంటల్ చైర్, స్లిప్ ల్యాంప్, ఏఆర్ మిషన్, మైక్రోస్కోప్, ల్యాప్రోస్కోపిక్ సమకూర్చుకోవాల్సి ఉంది. అలాగే, జనరేటర్, అంబులెన్స్, బోరు మోటార్, ఆర్ఓ ప్లాంట్ కూడా అందుబాటులో ఉండాలి.

అందుబాటులోకి డయాలసిస్

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయగా.. ఈ వారం సేవలు అందుబాటులోకి రానున్నాయి. డయాలసిస్ సేవల కోసం అవసరమైన గది, యంత్రాలు, జనరేటర్, బ్యాటరీలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఇక నుంచి డయాలసిస్ కోసం కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సిన బాధ తప్పుతుంది.

పెరిగిన సుఖ ప్రసవాలు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో సుఖ ప్రసవాల సంఖ్య పెరిగింది. అవసరమైన అయిన వారికి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. వైద్య విధాన పరిషత్‌లోకి మారాక ఏడుగురు ప్రత్యేక వైద్య నిపుణులు, నలుగురు జనరల్ డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా స్త్రీ ప్రసూతి ప్రత్యేక వైద్య నిపుణులు లేక గర్భిణులకు వైద్యం అందలేదు. కొత్తగూడెం, ఖమ్మం వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే సేవలు అందుబాటులోకి రావడం విశేషం.

డయాలసిస్ సేవలు ప్రారంభిస్తాం



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో మరో వారంలో డయాలసిస్ సేవలు ప్రారంభిస్తాం. ఇందుకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. అలాగే, ఆర్థోపెడిక్, దంత వైద్యం కోసం కావాల్సిన పరికరాలు సమకూర్చుకోవడంతో పాటు థియేటర్ల ఏర్పాటు కోసం కృషి చేస్తున్నాం. నిధులు సమకూరగానే ఆ సేవలూ మొదలుపెడతాం.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

నిరసన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



ఇల్లెందు: ఇల్లెందులో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో ఇల్లెందు కాంగ్రెస్ నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జగదాంబా సెంటర్ నుంచి కరెంట్ ఆఫీస్ ఖమ్మం రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఇల్లెందు మీదుగా ఖమ్మానికి వెళుతూ ఇల్లెందులో జరుగుతున్న ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు చీమల వెంకటేశ్వర్లు, డానియేల్, పులి సైదులు, లింగంపల్లి శ్రీనివాస్, ఆవుదుర్తి శంకర్, శంకర్‌నాయక్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: మండలం నుంచి టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీకి తరలివెళ్లారు. పేపర్ల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరి తగదని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జూలూరుపాడు: స్థానిక సహకారం సంఘం ఆధ్వర్యంలో జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి(ఏఓ) ఎస్ రఘుదీపిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ ఎం తిరుపతిరావు, ఏఈఓ గౌస్, సొసైటీ సీఈఓ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చుంచుపల్లి: మండల పరిధిలోని బాబూక్యాంపు పంచాయతీలో సోమవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ బాదావత్ శాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రూ.5.49 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ బాబురావు, ఎంపీటీసీ కూసన వీరభద్రం, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సెక్రటరీ విజయ్, శ్రీను, మాధవి, సుబ్బారావు, కునుకుంట్ల రవి, వెంకటయ్య, శివ కుమార్ పాల్గొన్నారు.

బీఎల్ఓ విధుల నుంచి మినహాయించాలి



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్లను ఎన్నికల బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వేసవి సెలవులు ఇచ్చి టీహెచ్ఆర్ ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని, రెండు నెలలుగా అంగన్‌వాడీ సెంటర్లకు నూనె, పాలు, పప్పు, బియ్యం, గుడ్లు సరిగా రావడం లేదని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మల్లిఖార్జున్, సరోజిని, వినోద, విజయలక్ష్మి, శ్రీదేవి, కృష్ణవేణి, అంజలి, శ్రీలత, రాజేశ్వరి పాల్గొన్నారు.


నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న నాయకులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుంటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణలు డిమాండ్ చేశారు. సోమవారం దగ్ధమైన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొడ్డా రవికుమార్, కొండబోయిన వెంకటేశ్వర్లు, బుడుగుల శ్రీకాంత్, నిరంజన్, రహీం, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షకులకు గౌరవ వేతనం చెల్లింపు



ట్రెయినర్లకు చెక్కులు అందజేస్తున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆధ్వర్యాన మహిళలకు వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇప్పించగా, ట్రెయినర్లకు మంజూరైన గౌరవవేతనం చెక్కులను జీఎం పర్సనల్ కట్టా బసవయ్య సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందుతున్న మహిళలు రూపొందించే ఉత్పత్తులకు మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ శిక్షణ మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందనిచెప్పారు. ఈ కార్యక్రమంలోఅధికారులు సేవా సమితి బాధ్యులు కె.శ్రీనివాస్‌రావు, ధన్‌పాల్ శ్రీనివాస్, సుజాత, కవిత, దియా సుల్తానా, ఇందుమతి, మొబినా సుల్తానా, ఎం.డీ.యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన మృతి చెందిన కార్మికుల పిల్లలకు సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జ్ జీఎం కె.సుధాకర్ రావు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... ఏరియా ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు మీకు కేటాయించిన గనుల్లో రక్షణతో కూడిన ఉత్పత్తి చేస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండి.రజాక్, ఇన్‌చార్జ్ డీజీఎం పర్సనల్ దేవరకొండ కిరణ్‌బాబు, సీనియర్ పీఓ మురళి, జూనియర్ అసిస్టెంట్ ఇంధావతి, రామాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు చోట్ల భిక్షాటన, ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ర్యాలీ నిర్వహిస్తున్న వీఓఏలు, నాయకులు



పాల్వంచరూరల్: ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు



జూలూరుపాడులో..



టేకులపల్లి: ఒంటికాలిపై నిరసన..

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజలకు వివరిస్తూ పార్టీ నిర్మాణాత్మక అభివృద్ధికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సూచించారు. మండలంలోని చల్లసముద్రం, రేపల్లెవాడ పంచాయతీల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. రేపల్లెవాడ పంచాయతీ నిజాంపేట గ్రామంలో ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం చల్లసముద్రం గ్రామపంచాయతీలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇల్లెందులో నిర్వహిస్తున్న పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు విధిగా హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి చల్లసముద్రం గ్రామపంచాయతీలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని గుర్తుచేశారు. ఈ సమావేశంలో నాయకులు బండారు వెంకన్న, బండారు శ్రీనివాసరావు, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, సర్పంచ్ అలెం కౌసల్య, రమేష్, అయిలు నారాయణ, రాంమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం జరగనున్న బీఆర్‌ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తెలిపారు. సోమవారం రామవరంలో తన నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, రామవరం పట్టణ అధ్యక్షుడు గౌస్, నాయకులు కూరపాటి సుధాకర్, కూరగాయల శ్రీను, రుక్మిణి, డాబా నాగేశ్వరరావు, సూరిబాబు, అరుణ్, శ్యామ్, బచ్చు శివప్రసాద్, శ్రీకాంత్, రాజేందర్, మజీద్, దొమ్మేటి నాగేశ్వరరావు, కోయాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో ముందుండాలి



మాట్లాడుతున్న చైర్మన్ ఎంవీ చౌదరి

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు కష్టపడి చదువుకోవటం వల్ల భవిష్యత్తులో ఉన్న స్థానాలు అధిరోహిస్తారని శ్రీవివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ విద్యా సంస్థల చైర్మన్ ఎంవీ చౌదరి అన్నారు. సోమవారం ఈ కళాశాలలో ఫెర్‌వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఈఓ ఎం.చైతన్యకృష్ణ, ప్రిన్సిపాల్ సతీష్ వర్మ, కళాశాల డీన్ సాయి తదితరులు ఉన్నారు.

సమావేశం వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లోని డీవైసీఎల్సీ కార్యాలయంలో జరిగిన కన్సలేషన్ సమావేశానికి సింగరేణి యాజమాన్యం హాజరుకాలేని కారణంగా తదుపరి సమావేశాన్ని మే 8 తేదీకి వాయిదా వేశారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల చర్చపై గత నెలలో ఏర్పాటు చేసిన సమావేశానికి యాజమాన్యం హాజరుకాక పోవడంతో డీవైసీఎల్సీ దేవరకొండ శ్రీనివాస్‌రావు సమావేశాన్ని వాయిదా వేశారు. మళ్లీ ఇప్పుడు అధికారులు హాజరుకాకపోవడం అంటే కార్మికులపై ఎంత చిన్న చూపు ఉందో ఇట్టే అర్థం అవుతుందని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు రాసూరి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌సీ మహేష్, మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ఓసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటాచారిని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ కోరారు. సోమవారం ఆయన పీఓ చాంబర్‌లో ఆయనతో మాట్లాడుతూ.. కార్మికులు సంస్థ అభివృద్ధికి సహకరిస్తుంటే వారికి కనీస సౌకర్యాలు ఎండల నుండి ఉపశమనం కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పీఓ వీలైనంత త్వరలో ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూసన వీరభద్రం, రమేష్ బాబు, ఎస్ఆర్.మూర్తి, మురళి కృష్ణ, చంద్రశేఖర్, శ్రీధర్, రాంబాబు, సుబ్బారెడ్డి, రత్నాకర్, సత్యనారాయణ, అబ్రోస్, యూసఫ్, సందీప్, గుమ్మడి, శంకర్, సతీష్, రఘువీర, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జేకే ఓసీ ఏర్పాటును నిలువరించండి

ఇల్లెందురూరల్: తమకు నిలువ నీడలేకుండా చేసేలా ఏర్పాటవుతున్న జేకే ఓసీని తాము వ్యతిరేకిస్తున్నామని వివరిస్తూ మండలంలోని తిలక్‌నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు గ్రామపంచాయతీ ప్రజలతో కలిసి వెళ్లి ఆమె ఓసీ ఏర్పాటు వల్ల కలిగే ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యాజమాన్యం స్పష్టత ఇచ్చే వరకు ఓసీ ఏర్పాటుకు అనుమతించొద్దన్నారు.

ఈనెల 29న చలో హైదరాబాద్



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

కొత్తగూడెంటౌన్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఈనెల 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ) జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులకు హెల్త్‌కార్డుల జారీ, రక్షణ చట్టం అమలుకోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు న్యాయవాదులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కిలారు పురుషోత్తం, పి.కిషన్‌రావు, కె.పుల్లయ్య, సాదిక్‌పాషా, గడిదాసి కాంతయ్య, జీ.కే.అన్నపూర్ణ, రావిలాల రామారావు, దూదిపాల రవికుమార్, అరకల కరుణాకర్, మేదరమెట్ల శ్రీనివాసరావు, పోశం భాస్కరావు, పాయం రవి వర్మ, గౌతం పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్య తీసుకోండి

పాల్వంచరూరల్: సమాజంలో అశాంతిని, మత విద్వేషాలను రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్‌కు ఐక్య క్రైస్తవ కార్యచరణ సమితి మండలాధ్యక్షుడు జాన్ విల్సన్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్, కాంతారావు కోరారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో, మందేరకలపాడు, పట్టణ పరిధిలోని తెలంగాణ నగర్‌లో నిర్మాణ దశలో ఉన్న క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు ఉద్దేశపూర్వకంగా ఆటంకాలను కలిగిస్తున్నారన్నారు. క్రైస్తవుల మనోభావాలను గాయపరుస్తున్నారన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



టేకులపల్లి: సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలను చూపిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

టేకులపల్లి: తెలంగాణలో నియమించబడిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి(జేపీఎస్)ల ప్రొహిబిషనరీ పీరియడ్ పూర్తయినప్పటికీ రెగ్యులర్ చేయడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని జేపీఎస్‌లు అందరూ సామూహికంగా లేఖలు రాసి సీఎం కేసీఆర్‌కు రిజిష్టర్ పోస్టు చేశారు. అనంతరం టీపీఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు బంగారు సందీప్‌కుమార్ మాట్లాడగా శిరీష, వరుణ్‌తేజ, దీప్తి, శరత్‌చంద్ర, దుర్గాభవానీ, రాజు, సౌజన్య, మీనాకుమారి, మంగీలాల్, రజిత తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దశలవారీ ఆందోళనలో భాగంగా తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు వారు వ్రాసిన ఉత్తరాలను పోస్ట్ చేశారు. రోహిణి, ఉమారాణి, నర్మద, కృష్ణకుమారి, సుమలత, దివాకర్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పోస్టు కార్డులను ప్రదర్శించి పోస్టు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడగా జేపీఎస్‌లు సంజీవ సుస్మిత, యాకరాజు, తిరుపతి, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



సుజాతనగర్‌లో..



ఇల్లెందురూరల్: పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు